క్లుప్తంగా

పోలీసు సర్కిల్ భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే అన్నా



నూతన భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

కంభం: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీసు సర్కిల్ కార్యాలయాన్ని గురువారం సాయంత్రం గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పరిశీలించారు. కంభం నూతన సర్కిల్‌గా ఏర్పడిన నేపథ్యంలో చౌక్ సెంటర్‌లో నిరుపయోగంగా ఉన్న పాత పోలీసుస్టేషన్ భవనాన్ని సర్కిల్ కేంద్రంగా మార్చారు. నిర్మాణం పూర్తి చేసుకొని త్వరలో ప్రారంభం కాబోతున్న నూతన భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యేకు సీఐ ఎం.రాజేష్, ఎస్ఐ నాగమల్లేశ్వరరావు పనులకు సంబంధించిన వివరాలు తెలియజేశారు.

నేడు చింతగుంటలో గడప గడపకు మన ప్రభుత్వం

కొనకనమిట్ల: మండలంలోని చింతగుంట పంచాయతీలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ ఏడుకొండలు, అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏపీపీ బాలునాయక్



బాలునాయక్‌ను అభినందిస్తున్న న్యాయవాదులు

మార్కాపురం టౌన్: మార్కాపురం ఆరో అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రాత్లావత్ బాలునాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయనను ఏపీపీ దొండపాటి గాంధీరెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు భూపని కాశయ్య, న్యాయవాదులు వెంకటేశ్వరరెడ్డి, అశోక్ నాయక్, కోర్టు సిబ్బంది అభినందించారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కేపీపీ నాగార్జునరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కృష్ణమోహన్‌రెడ్డికి నూతన ఏపీపీ కృతజ్ఞతలు తెలిపారు.

భూమి కోసం దరఖాస్తు చేసుకోవాలి

కురిచేడు: భూమిలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూ పంపిణీ చేపట్టారని జెడ్పీటీసీ సభ్యుడు నుసుం వెంకట నాగిరెడ్డి తెలిపారు. భూమి లేని నిరుపేదలు సాగు భూమి కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, రైస్‌కార్డు జత చేసి ఇవ్వాలని సూచించారు.

సాయిబాబా ఆలయంలో చోరీకి విఫలయత్నం

దొనకొండ: స్థానిక బ్రహ్మారావుపేటలోని సాయిబాబా ఆలయంలో దొంగలు బుధవారం రాత్రి చోరీకి విఫలయత్నం చేశారు. దొంగలు గర్భగుడి తాళాలు తీసి లోపలికి ప్రవేశించారు. గుడిలోని హుండీని తెరిచారు. ఏమీ లేకపోవటంతో వెనుదిరిగి వెళ్లారు. గురువారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దొనకొండలో వారం రోజుల నుంచి రెండు మూడు చోట్ల దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు.

ప్రైవేట్ విద్యా సంస్థల్లో పేదలకు రిజర్వేషన్



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరెడ్డి

పొదిలి: ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ విద్యా సంస్థల్లో 25 శాతం పేద విద్యార్థులకు ఉచితంగా విద్య అందిస్తున్నట్లు ఎంఈఓ ఎం.శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వివరాలను తెలిపారు. 1వ తరగతిలో చేరేందుకు ఐదేళ్లు నిండిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆధార్‌కార్డు నకలు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, నేటివిటీ సర్టిఫికెట్, విద్యార్థి జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన ధరఖాస్తులను ఆన్‌లైన్ లేదా గ్రామ, వార్డు సచివాలయం, ఎంఈఓ కార్యాలయంలో అందజేయాలని స్పష్టం చేశారు.

పుర ప్రజలకు కనీస సౌకర్యాలు

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- రూ.47 లక్షలతో సాగర్ పైప్‌లైన్, రూ.22 లక్షలతో సీసీ రోడ్ల ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ప్రజలకు కనీస సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని 22వ బ్లాక్ పరిధిలో కమల హ్యాపీ హోమ్స్‌లో 47 లక్షల రూపాయలతో నిర్మించిన సాగర్ వాటర్ పైప్‌లైన్, రూ.22 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణ ప్రజలకు శాశ్వతంగా నీటి సమస్యను తొలగించేందుకు కృషి చేశామన్నారు. గతంలో వైఎస్సార్ హయాంలో కొన్ని వార్డులకు పైప్‌లైన్లు వేయగా మరికొన్ని మిగిలి ఉన్నాయని, ఇప్పుడు ఆ ప్రాంతాల్లో సాగర్ పైప్‌లైన్ వేసి నీరు సరఫరా చేస్తామన్నారు. పశ్చిమ ప్రకాశంపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి పెట్టినందువల్లే వెలిగొండ ప్రాజెక్టు దాదాపు పూర్తయిందని, మెడికల్ కాలేజీ పనులు చకచకా జరుగుతున్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీ బేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్ వెలుగొండ కేశవరావు, కమిషనర్ గిరికుమార్, డీఈ సుబానీ, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, కౌన్సిలర్లు బుశెట్టి నాగేశ్వరరావు, నగేష్, హర్షిత బాబి, వనాజాక్షి చెన్నారెడ్డి, ఉత్తమ కుమార్, రంగయ్య, రామలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సంఘమిత్రలకు లోకోస్ యాప్‌పై శిక్షణ



లోకోస్ యాప్‌పై శిక్షణ ఇస్తున్న ఏపీఎం



మాట్లాడుతున్న రమేష్‌బాబు

పుల్లలచెరువు: డ్వాక్రా సంఘాల సంఘమిత్రలకు లోకోస్ యాప్ వినియోగంపై శిక్షణ గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏపీఎం వెంకటయ్య ఆధ్వర్యంలో ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామీణ పేదరికి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సంఘమిత్రలకు లోకోస్ యాప్ వినియోగంపై రెండు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. డ్వాక్రా సంఘ సభ్యులు యాప్‌ను వినియోగించడం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. లోకోస్ యాప్‌లో పొదుపు నగదు చెల్లింపు, లావాదేవీలు, స్టేట్మెంట్ తయారు చేసుకునేందుకు సౌకర్యంగా ఉంటుందన్నారు. సంఘ సభ్యురాలు తమ ప్రాథమిక సమాచారం, బ్యాంకు లావాదేవిలతో పాటు మహిళా సమాఖ్యకు సంబంధించిన ఇతర కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చని సూచించారు. లోకోస్ యాప్ వినియోగంపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించేందుకు ముందుగా సంఘమిత్రలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పుల్లలచెరువు మండలంలో 1325 స్వయం సహాయక సంఘాల డేటాను గ్రూపుల వారీగా ఈ యాప్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ట్రైనర్లు రంగనాయకులు, రవి, కిరణ్, చార్లెస్ పాల్గొన్నారు.

డ్వాక్రా సభ్యుల వివరాలు లోకోస్ యాప్‌లో నమోదు చేయాలి

మార్కాపురం: డ్వాక్రా సంఘాల సభ్యుల వివరాలను లోకోస్ యాప్‌లో సమగ్రంగా నమోదు చేయాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రమేష్‌బాబు సూచించారు. గురువారం స్థానిక డ్వాక్రా బజారులో డీఆర్‌డీఏ సిబ్బందికి లోకోస్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. డ్వాక్రా సంఘాల సభ్యులు తయారు చేసే ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు లోకోస్ యాప్ ఉపయోగపడుతుందని వివరించారు. మార్కాపురం మండలంలోని 1250 స్వయం సహాయక వివరాలు వేగంగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు మనోకుమారి, నాగభూషనం, సులోచన తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

తాళ్లూరు: గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ పారదర్శకంగా పనిచెయ్యాలని ఎంపీడీఓ వై.శ్రీనివాసరావు కోరారు. మండల ప్రజా పరిషత్ సమావేశంలో గురువారం మండలంలోని సచివాలయ ఉద్యోగులు, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలతో ఆయన సమావేశమయ్యారు. ప్రతి ఉద్యోగి సచివాలయానికి అనుసంధానమైనందున సంబంధిత రిజిస్టర్‌లో సంతకం చేయాలని చెప్పారు. సాయంత్రం కూడా తప్పనిసరిగా స్పందనలో హాజరు కావాలని కోరారు. జగనన్న పాల వెల్లువ పథకం లేకుండా రైతులకు మద్దతు పాల ధర లభించేదా అన్న విషయాన్ని రైతులకు వివరించి పథకంలో ప్రతి ఒక్కరి సహకారం తీసుకోవాలని కోరారు. నాడు-నేడు పాఠశాలల్లో జరుగుతున్న పనులపై సమీక్షించారు. ఈ నెల 31లోపు పనులు పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈఓ జి.సుబ్బయ్య వివరించారు. ప్రధానోపాధ్యాయుడు ఆయా పాఠశాలల్లో పనులను పరిశీలించాలని చెప్పారు. నాడు-నేడు డీఈ విశ్వనాథ్, ఏఈ గోపి, ఈఓఆర్డీ ఎన్‌యూ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

డాక్టర్ భాగ్యలక్ష్మి మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: పట్టణానికి చెందిన డాక్టర్ అరికేరి భాగ్యలక్ష్మి (59) అనారోగ్యం కారణంగా గురువారం మృతి చెందారు. స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు.. భాగ్యలక్ష్మి భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు గిద్దలూరు ప్రభుత్వ వైద్యుడు సూరిబాబు, ఇతర వైద్యులు ఉన్నారు.

8 నుంచి గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు

మార్కాపురం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి జూన్ 16వ తేదీ వరకు వేసవి శిక్షణ తరగుతులు నిర్వహిస్తునట్లు గ్రంథపాలకులు జీవీ శివారెడ్డి తెలిపారు. మొత్తం 40 రోజులపాటు వేసవి శిక్షణ తరగుతులు ఉంటాయని 6 నుంచి 10 వ తరగతి వరకు విద్యార్థులు రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ తరగతుల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కథలు చదివి వినిపించడం, పుస్తకాలు చదవడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయిటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్రామా తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. చిన్నారులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి ఉన్నవారు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

బేస్తవారిపేటలో కూడా..

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 16 వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఆరు నుంచి 10వ తరగతి, 10 నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులు రోజూ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు కథలు చదివి వినిపించడం, పుస్తకాలు చదివించడం, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, డ్రామా, బొమ్మలు తయారు చేయించడం వంటి అంశాలపై వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

యర్రగొండపాలెం: కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశామని, ఈ మేరకు మండలంలో 30 మంది విద్యార్థులను గుర్తించినట్లు ఎంఈవో పి.ఆంజనేయులు గురువారం తెలిపారు. వారిలో 10 మంది విద్యార్థులను కొనకనమిట్ల మండలం వెలుగొండ రెసిడెన్షియల్ స్కూల్లో, 20 మంది విద్యార్థినులను మార్కాపురం మండలం రాయవరం రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పించామని, కేజీబీవీలో ఫెయిలైన విద్యార్థినులను త్రిపురాంతకంలో చేర్పుతున్నట్లు చెప్పారు. ఆయా పాఠశాలల్లో ప్రభుత్వం ఉచిత భోజనం, వసతి కల్పించిందని, ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు.

అంగరంగ వైభవంగా ఆదిదేవుడి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న త్రిపుర సుందరి సమేత త్రిపురాంతక స్వామి, భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని గురువారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అర్చకులు మూలంరాజ్ రాజ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ధ్వజారోహణం, సంప్రోక్షణ పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌లకు సుప్రభాత సేవలు, పంచామృతాభిషేకాలు నిర్వహించి మూలవిరాట్‌లకు సువర్ణ, రత్న, నాగాభరణ అలంకారాలు, విశేష పూజలు చేశారు. సాయంత్రం 5 గంటలకు స్వామివార్ల కల్యాణ రాయబారం నిర్వహించి రాత్రి 7గంటలకు ఉత్సవమూర్తులను పసిడి, రజిత ఆభరణాలతో, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ముమ్మారు గర్భగుడి ప్రదక్షిణ అనంతరం 8 గంటలకు నందివాహనంపై కొలువై ఉండగా అర్చకులు స్వామివారి ఉత్సవరులను ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై ప్రతిష్టించారు. కల్యాణ క్రతువును, శైవాగమ ప్రతిష్టాచార్యులు నాదెండ్ల విశ్వేశ్వరశర్మ, రామేశ్వర్ గురుకుల్ ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును నిర్వహించారు. కల్యాణ ఉభయదాతలు దరువూరి వీరయ్య దంపతులు స్వామివారి కల్యాణానికి తలంబ్రాలు, కల్యాణ వస్త్రాలు సమర్పించారు.

మొక్కులు తీర్చుకున్న జెడ్పీ చైర్‌పర్సన్



ఆంజనేయుడికి పూజలు చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

బల్లికురవ: ప్రజలంతా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రార్థించారు. గురువారం మండలంలోని వెలమవారిపాలెం సమీపంలోని ఆంజనేయుడిని దర్శించుకుని ఆలయం వద్ద జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తన కుమారుడు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, కోడలు నందిని, కుటుంబ సభ్యులతో కలిసి బూచేపల్లి వెంకాయమ్మ ఆలయానికి రాగా, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రేపు దర్శి మండల సర్వసభ్య సమావేశం

దర్శి టౌన్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ గోళ్లపాటి సుధారాణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుసుమకుమారి తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించి పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని ఆయన ఆమె విజ్ఞప్తి చేశారు.

జెడ్పీ చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

ముండ్లమూరు: మండలంలోని జమ్మలమడక ఆంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ఆలయంలో గ్రామస్తులతో కలిసి కుటుంబ సమేతంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

దర్శి టౌన్: మండలంలోని రాజంపల్లి శివారులో అచ్చు, బొమ్మ ఆడుతున్న ఆరుగురిని ఎస్ఐ రామకృష్ణ గురువారం తన సిబ్బందితో కలిసి అకస్మికంగా దాడి చేసి అరెస్టు చేశారు. జూదరుల నుంచి రూ.38,120 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రణవ స్వరూపా.. పాహిమాం

గిద్దలూరులో ఘనంగా లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల



అగ్గి సేవ చేస్తున్న భక్తులు



నరసింహ స్వామికి పూజలు



హోమం చేస్తున్న పండితులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కొండపై శ్రీ లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా అభయాంజనేయస్వామి ఆలయం నుంచి కొండపైకి స్వామివారిని భక్తులు ఊరేగింపుగా తరలించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్నారు. వెంకట నరసమ్మ ఆధ్వర్యంలో అగ్గి సేవ చేశారు. పట్టణానికి చెందిన భూపని సుబ్రహ్మణ్యం, భూపని హరికృష్ణ స్వామివారికి నూతనంగా గరుడ వాహనం చేయించారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నరసింహారావు దంపతులు పాల్గొన్నారు.

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులోని అమ్మవారిపల్లె కొండమీద వెలసిన కపిలగిరి లక్ష్మీనరసింహస్వామి జయంతి మహోత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం 6 గంటలకు చంద్రోత్సవం, స్వామివారి కళ్యాణాన్ని అర్చకులు ఎస్.రంగరామానుజచార్యులు, రాంబాబు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏర్పాట్లను నిర్వాహకులు మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, బొగ్గరపు శేషయ్య, తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా నృసింహ జయంతి

త్రిపురాంతకం: నృసింహ జయంతి ఉత్సవాలను వేదపండితులు వైభవంగా గురువారం నిర్వహించారు. త్రిపురాంతకం మండలం గొల్లపల్లిలో నృసింహ జయంతి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద ప్రత్యేంగా హోమాలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, విష్ణుసహస్రనామ పారాయణం, స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవంలో దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అన్నప్రసాద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

సచివాలయాలు, ఆర్బీకేలకు సొంత నీడ



గొట్లగట్టులో ముగింపు దశకు చేరిన భవనాలు

- వేగంగా ప్రభుత్వ భవనాల నిర్మాణం



చినమనగుండంలో పూర్తయిన సచివాలయం



పాతపాడులో రైతు భరోసా కేంద్రం

కొనకనమిట్ల: గ్రామస్థాయిలో పరిపాలనా సౌలభ్యం, ప్రజలకు విస్తృతంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలతో పల్లెలు కొత్త రూపును సంతరించుకున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన వెంటనే గ్రామ సచివాలయాలు, రైతుల సౌకర్యార్థం రైతు భరోసా కేంద్రాలు, వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవనాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. కొనకనమిట్ల మండలంలో 26 పంచాయతీలుండగా జనాభా ప్రాతిపదికన 18 గ్రామ సచివాలయలు ఏర్పాటు చేశారు. కొనకనమిట్ల, గొట్లగట్టు, పెదారికట్ల, చినారికట్ల, చినమనగుండం, నాగంపల్లి, సిద్ధవరం, గరిమినపెంట(పాతపాడు), కాట్రగుంట, తువ్వపాడు, నాగరాజుకుంట, మునగపాడు, వెలిగండ్ల, చింతగుంట, వాగుమడుగు, వద్దిమడుగు, రేగుమానిపల్లి, గార్లదిన్నెలో సచివాలయాల నిర్మాణానికి రూ.44 లక్షలు, ఆర్బీకేల నిర్మాణానికి రూ.21 లక్షలు, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలకు రూ.17.5 లక్షల నిధులు మంజూరు చేశారు. వీటితోపాటు బల్క్ మిల్క్ సెంటర్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే వాగుమడుగు, కాట్రగుంట, గరిమినపెంట పాతపాడు, సిద్దవరం, మునగపాడు, వెలిగండ్ల, నాగరాజుకుంట, రేగుమానిపల్లి, చినారికట్ల గ్రామ సచివాలయాలు పూర్తి కాగా వాటిని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ప్రారంభించారు. చినమనగుండం, గొట్లగట్టులో సచివాలయాలు, ఆర్బీకేల నిర్మాణం తాజాగా పూర్తయింది. వీటిని త్వరలోనే ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

> **పనులు వేగవంతం చేశాం**
> మండలంలో 18 సచివాయలు, రైతు భరోసా కేంద్రాలతో పాటు పలు చోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాల కేంద్రాలకు సొంత భవనాలు నిర్మిస్తున్నాం. వీటి నిర్మాణానికి సుమారు రూ.10 కోట్లు మంజూరయ్యాయి. ఉపాధి హామీ పథకం, పంచాయతీ నిధులతో సొంత భవనాల నిర్మాణం జరుగుతోంది. వీలైనంత త్వరగా భవనాల నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాం.
> – నిరంజన్, పీఆర్ ఏఈ